## క్లుప్తంగా

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ++ గ్రేడ్

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) బీ++ గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం న్యాక్ సంస్థ ద్వారా ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఏడు పాయింట్లకు 2.98 పాయింట్లు రావడంతో బీ++ గ్రేడ్ లభించిందన్నారు. ఈ ధ్రువీకరణ ఐదు సంవత్సరాల పాటు కొనసాగుతుందని దీని ద్వారా యూజీసీ గ్రాంట్స్ మంజూరుతో పాటు కళాశాల అభివృద్ధికి వివిధ సంస్థల భాగస్వామ్యం లభిస్తుందన్నారు. న్యాక్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాక్ గుర్తింపు రావడానికి ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చంద్రబోస్, పీఆర్వో నల్లి రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులు ఎంతో కృషి చేశారన్నారు.

### బాలాజీని దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారి



ఐఆర్ఎస్ అధికారి శోభిత్ గుప్తాకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

మామిడికుదురు: ఐఆర్ఎస్ అధికారి, సెంట్రల్ అబ్జర్వర్ శోభిత్ గుప్తా శుక్రవారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ, భూ సమేత బాల బాలాజీని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. గుప్తాకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

### వైభవంగా శోభాయాత్ర



జగ్గన్నపేట ఆలయంలో రామ స్పర్శ అక్షత వృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అయోధ్య రామాలయ నిర్మాణ తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామ స్పర్శ అక్షతల వృద్ధి కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా భక్తులు లలితా సహస్రనామ పారాయణ చేశారు. భక్తులు కోలాటం ఆడి అలరించారు. అనంతరం శోభాయాత్ర ఘనంగా జరిగింది. జనవరి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు గ్రామంలో అక్షతల వితరణ కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పంచాయతీ రాజ్ సదస్సును విజయవంతం చేయాలి

అంబాజీపేట: వచ్చే నెల 3వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మి అధ్యక్షతన ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అత్యధికంగా తరలిరావాలన్నారు.

### వజ్రోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

మామిడికుదురు: ఎస్టీయూ 75వ వజ్రోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. మామిడికుదురు ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జనవరి 12, 13 తేదీల్లో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వజ్రోత్సవాలు జరుగుతాయని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్ బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవరావు తెలిపారు. వజ్రోత్సవ సభకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మట్టా నాగరాజు, ఎస్టీయూ ప్రతినిధులు జీవీవీ సత్యనారాయణ, మానుపాటి మునేశ్వరరావు పాల్గొన్నారు.

### రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి

మలికిపురం: ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయవాది గొల్ల జయప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుడిమెళ్లంక చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకుంటే ఎవరికి వారే న్యాయం కోసం ఆలోచించి పోరాడుకోవచ్చని అన్నారు. ప్రధానంగా ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. చక్కని ప్రభుత్వం ఏర్పాటులో మన ఓటే కీలకమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. భక్తి క్రమశిక్షణను పెంచుతుందని, క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర క్రైస్తవ ట్రినిటి చర్చి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కేఎస్ఎన్ రాజు, గొల్ల ఎలీషా, దీపాటి ఏసురత్నం పాల్గొన్నారు.

# ఆడపడుచు కట్నంగా ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- ఖండ్రిగలో 135 మంది మహిళలకు ఇళ్ల స్థలాల స్వాధీనం



ఖండ్రిగలో ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసి పసుపు కుంకుమలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో మహిళలకు ఆడపడుచు కటï్నంగా వారి పేరున సొంత ఇంటిస్థలం ఇచ్చి, తదుపరి ఇల్లు కల్పించడం ద్వారా వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థిరాస్తి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని ఖండ్రిగలో 135 మందికి ఇళ్ల స్థలాల స్వాధీనం కార్యక్రమం శుక్రవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. మహిళలకు స్థలాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా స్వాధీనం చేశారు. లబ్ధిదారులకు పట్టాతో పాటు జగ్గిరెడ్డి వ్యక్తిగతంగా పసుపు, కుంకుమ, గాజులు, రవిక అందజేశారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నాటి సీఎం వైఎస్సార్ హయాంలో, మళ్లీ నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంత భారీ సంఖ్యలో జగన్ ప్రభుత్వం తప్ప మరే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళల పేరునే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ద్వారా సీఎం జగన్ చారిత్రక ఘట్టానికి నాంది పలికారన్నారు. నియోజకవర్గంలో 343.98 ఎకరాల భూమి సేకరించి, 17,190 మందికి, ఈ మండలంలో 3,980 మందికి పట్టాలుగా ఇవ్వడం సరికొత్త రికార్డని అన్నారు. దాదాపు ప్రతి స్థలం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలు విలువ చేస్తుందన్నారు. దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. రేపు మళ్లీ జగన్ ప్రభుత్వం వచ్చాక రోడ్డు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించి, ఇళ్లు కట్టించే కార్యక్రమం చేపడతామన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క జగన్ ప్రభుత్వమేనన్నారు. భవిష్యత్‌లో కూడా ఈ పథకాలన్నీ అమలు చేసే సత్తా ఒక్క జగన్‌కే ఉందన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీటీసీ పితాని లక్ష్మీతులసి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, గ్రామ పార్టీ బొక్కా సత్యనారాయణ, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి దిశగా మున్ముందుకు రాష్ట్రం



శానపల్లిలంక పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండుకుదురులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, శానపల్లిలంకలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, ఎస్ మూల పాలెంలో రూ.24 లక్షలతో నిర్మించిన సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయ సేవలను గ్రామాల్లోకి అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, శానపల్లిలంక సర్పంచ్ పంబల కుమారి, ఎంపీటీసీ పశ్చిమాల సుబ్బారావు, ఎస్.మూలపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు మట్టపర్తి రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోనే చంద్రశేఖర్, బొంతు రాజేంద్రప్రసాద్, పండు, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

## పేదరిక నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



చింతలమోరి సభలో మాట్లాడుతున్న శోభితుగుప్తా

మలికిపురం: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను అందిస్తుందని కేంద్ర ఎడ్యుకేషన్ ఆఫ్ మినిస్ట్రీస్ సీనియర్ ఐఏఎస్ శోభితు గుప్తా అన్నారు. మండలంలోని చింతలమోరిలో వికసిత్ భారత్ యాత్రలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఎంపీడీవో వీరస్వామి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం కనుమరుగవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాట్లాడుతూ ప్రధానమంత్రి దేశంలో అనేక సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు 20 పథకాలు అందుబాటులో ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల్లో ఆయా పథకాలు సంక్షేమం అందని వారందరికీ అందే విధంగా చూడటమే ఈ వికసిత్ భారత్ యాత్ర లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీపీఓ వి.కృష్ణకుమారి, డీఎల్పీవో పి.బొజ్జిరాజు, వివిధ శాఖల అధికారులు, ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ దొడ్డ నాగబాబు, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చీకరుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లు ఏ విధమైన సమ్మె చేయడం లేదు

అంబాజీపేట: తాము సమ్మెలోకి వెళుతున్నామంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఏ విధమైన సమ్మెలు చేయడం లేదని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వలంటీర్స్ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. వలంటీర్లు సమ్మె బాట పడుతున్నారని పచ్చ మీడియాలో తప్పుడు రాతలు రాయడంపై అంబాజీపేటలో వలంటీర్ల జేఏసీ నాయకులు శుక్రవారం ఖండించి నిరసన వ్యక్తం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఉద్దేశంతో అయితే వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారో తామంతా అందుకు అనుగుణంగానే ప్రభుత్వానికి విధేయులుగా పని చేస్తున్నామన్నారు. కానీ ఎల్లో మీడియా తమకు లేనిపోనివి ఆపాదించి కథనాలు ప్రచురించడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని ఎప్పుడు ఏం చేయాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎవరూ సమ్మెలో పాల్గొనవద్దని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని నాయకులు నార్గన స్వామి, ఎం.నాగలక్ష్మి, ఎం.సాయి, కె.ఝాన్సీ, ఎస్.సత్తిబాబు తదితరులు కోరారు.

## ఉరకలేసిన ఉత్సాహం



సంధిపూడిలో వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో పాల్గొంటున్న యువతీ యువకుల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులకు దశల వారీగా క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. నాలుగో రోజైన శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలను మండల స్థాయికి ఎంపిక చేశారు. ఆడుదాం ఆంధ్రాతో గ్రామాల్లో క్రీడా స్ఫూర్తి వెల్లివెరిస్తోందని, అనేక మంది పేద, మధ్య తరగతికి చెందిన క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు వీలు కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### ఇష్టానుసారం నిధులు బదిలీ చేశారు

మామిడికుదురు: నగరం పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన తాడి ఏసుబాబు తన ఇష్టానుసారంగా పంచాయతీ నిధులను పలువురు ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు బదిలీ చేశారని వార్డు సభ్యులు శుక్రవారం ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, వార్డు సభ్యులు బత్తుల సురేష్, కడలి రమేష్, అప్పారి శ్రీదేవి మాట్లాడుతూ తన ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సరైన విచారణ నిర్వహించలేదన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తాడి ఏసుబాబును వివరణ కోరగా గతంలో కూడా ఇదే విధంగా తనపై ఫిర్యాదు చేశారన్నారు. విచారణ కూడా జరిగిందని, రికార్డులు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారని చెప్పారు.

### ఘనంగా ఆండాళ్ అమ్మవారి సేవ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆండాళ్ అమ్మవారి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి గ్రామోత్సవం జరిగింది. వేద పండితులు వేదపఠనం ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ద్రవిడ పారాయణ, పుణ్యాహవాచనం, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రతి శుక్రవారం గోదాదేవి ఆండాళ్ అమ్మవారి గ్రామోత్సం కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వాడపల్లి గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్ రూ.16,500 వకుళామాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం అందించినట్లు ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

### కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధి వ్యాప్తి–నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. శరీరంపై మచ్చలు ఉన్న అనుమానితుల వివరాలను నమోదు చేసుకుని సంబంధిత పీహెచ్‌సీలకు వివరాలను అందజేస్తున్నారు. కుష్ఠు వ్యాధిపై ఆందోళన చెందవద్దని, అధునాతనమైన ఎండీటీ అందుబాటులోకి వచ్చిందని వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున, డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 12 వరకూ కొనసాగనున్న ఈ కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పేదల జీవన ప్రమాణాల వృద్ధే లక్ష్యం



పలివెల ఖండ్రిగలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల, ఖండ్రిగ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో సభ్యులకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో వీధివీధినా జగ్గిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా ఏర్పడిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, దానికనుగుణంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక పురోభివృద్ధి కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన ప్రజాభిమానం ఉప్పెనలో ప్రతిపక్ష టీడీపీ కూటమి గల్లంతు కావడం ఖాయమని జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రామాలయం వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కడలి త్రిమూర్తులు, బెజవాడ నారాయణరావు, కనుమూరి రామకృష్ణంరాజు తదితరులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీలు గునిపే శ్యామల, పితాని లక్ష్మీతులసి, పీఏసీఎస్ అధ్యక్షుడు ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొక్కా సత్యనారాయణ, సర్పంచ్‌లు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల భవిష్యత్తే సీఎం లక్ష్యం



వానపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేటి పేద, మధ్యతరగతి విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్ది బంగారు భవిష్యత్ కల్పించే బాధ్యతను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని శుక్రవారం వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద చేపట్టారు. సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో 45 పాఠశాలల్లో 2289 మంది 8వ తరగతి విద్యార్థులు, 376 మంది ఉపాధ్యాయులతో కలిపి మొత్తం 2665 మందికి ట్యాబ్‌లు మంజూరు చేసిందన్నారు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.16,500 ట్యాబ్‌తో పాటు బైజూస్ కంటెంట్ డౌన్‌లోడ్ ఖర్చు రూ.15,500తో మొత్తం రూ.32 వేల ప్రయోజనం చేకూరిందన్నారు. ఇలా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సభలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంటేశ్వరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ, వివిధ విభాగాల సభ్యులు దుప్పలపూడి మాధవరావు, ఇసుకపట్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**కేశనపల్లిలో..**

మలికిపురం: రాష్ట్రంలో పేదలకు సాంకేతిక విద్య ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి అన్నారు. మలికిపురం మండలం కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక దేవాలయాలని అన్నారు. స్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మలికిపురం పార్టీ మండల ప్రెసిడెంట్ అడబాల బ్రహ్మాజీ, గ్రామ శాఖ అధ్యక్షుడు యడ్ల జయ కృష్ణ, తూర్పుపాలెం సర్పంచ్ గుర్లింక సత్తిబాబు, యెనుముల నారాయణస్వామి, హెచ్ఎం ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా నేషనల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

అయినవిల్లి: సౌత్ ఇండియా నేషనల్ సైన్స్ ఫెయిర్‌కు మండలంలోని నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ పేరిట శుక్రవారం సైన్స్ ఫెయిర్ పోటీలు కడప జిల్లాలో జరిగాయి. ఈ పోటీల్లో అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిప్పా గౌతమ్, పసుపులేటి రాజేష్ ప్రతిభ కనబరిచారు. వీరు చేసిన ఫ్యూచర్ రోడ్స్ ఫర్ డెవలప్డ్ ఇండియా ప్రాజెక్టు సౌత్ ఇండియా నేషనల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయింది. జనవరి 27న విజయవాడలో నేషనల్ స్థాయి ప్రదర్శన ఉంటుందన్నారు.

## నాణ్యత, కొలతలపై అవగాహన ఉండాలి

అంబాజీపేట: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల్లో నాణ్యత, నైపుణ్యత, కొలతలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏపీడీ డి.రాంబాబు, డీఎల్‌డీవో ఎం.ప్రభాకర్ అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం మేట్లకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఏపీడీ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పనులు చేపట్టాలన్నారు. ఉపాధి పనులు, హాజరు నిర్వహణలోను, బ్యాంకునకు ఆధార్ అనుసంధానం చేయడంలో అలసత్వం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త పనులు గుర్తించడం, పండ్ల తోటల పెంపకంపై శిక్షణా, సుస్థిర ఆస్తుల కల్పనపై మేట్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, జె డ్పీటీసీ బి. వరలక్ష్మిలు మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఉపాధి కూలికి వంద రోజులు పని కల్పించాలని, అడిగిన వారందరికి పనులు ఇవ్వాలని మేట్లకు చెప్పారు. ఈ శిక్షణలో ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి, ఏపీఓ బి.చంద్రమోహన్, రీసోర్స్ పర్సన్స్ కె.కళ్యాణి, పి.వెంకటేశ్వరరావు, జేఈ పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బీసీ ఉద్యోగ సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ శుక్రవారం జరిగింది. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం పాల్గొని ప్రసంగించారు. బీసీ, ఓబీసీ ప్రభుత్వ ఉద్యోగులు అనునిత్యం సామాజిక సేవలను కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందు తరాల వారికి ఆదర్శంగా నిలవాలని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా ఆయా రంగాల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు సంఘటితమై ఐక్యతను చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బీసీ ఉద్యోగ సంఘాల సభ్యుల సమక్షంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరణ జరిగింది. తహసీల్దార్ ఐపీ శెట్టి, మాజీ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, యూటీఎఫ్ నేత వైవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరిపై బాలాజీ ఆశీస్సులు ఉండాలి



అప్పనపల్లి బాలబాలాజీ స్వామి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు శుక్రవారం నగరంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మాజీ చైర్మన్ పిచ్చిక చిన్న, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేత కుసుమ శ్రీధర్, ట్రస్టు బోర్డు సభ్యులు గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, ఆలయ ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### శ్లాబ్ కల్వర్టుతో ఆందోళన



కుంగిన శ్లాబ్ కల్వర్టు

మామిడికుదురు: పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల మధ్యలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై ఉన్న శ్లాబ్ కల్వర్టు మరింత కుంగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుంగిన ఈ శ్లాబ్ కల్వర్టు శుక్రవారం మరింతగా కుంగింది. దీంతో కల్వర్టు ఏ క్షణంలో అయినా కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. శ్లాబ్ కల్వర్టు కూలిపోకముందే దీని పునర్నిర్మాణం పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఘనంగా సీతారామచంద్రుడి గ్రామోత్సవం

అంబాజీపేట: అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసిన సీతారామచంద్ర స్వామిని ధనుర్మాసం సందర్భంగా స్వామిని శుక్రవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఖండవల్లి బదరీ నారాయణాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### ఏసురాజు మృతికి పలువురి సంతాపం



ఏసురాజు (ఫైల్)

ఆత్రేయపురం: ఏసురాజు పేరంటే గుర్తు వచ్చేది ఆత్రేయపురం కాలువ రేవు. ఆయన హోటల్‌లో పెసరట్టు, ఉప్మా రుచి చూసేందుకు పలువురు ప్రముఖులు ఎగబడతారు. ఆయన హోటల్‌కు సినీ హీరోలు, పలువురు ప్రముఖులు, వాడపల్లి దేవాలయానికి వచ్చి వెళ్లేవారు పెసరట్టు, ఉప్మా రుచి చూసి వెళుతుంటారు. ఆత్రేయపురానికి చెందిన నడింపల్లి వర ప్రసాదరాజు (ఏసురాజు) (61) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, శ్రీకన్య కంఫర్ట్ అధినేత కె.పెద్దిరాజుతో పాటు పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లందరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) ద్వారా జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఐపీ శెట్టి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని బడుగువానిలంక గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం ఈవీఎంలపై అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే అవగాహన సదస్సులో ప్రజలు లేవనెత్తిన సందేహాలను బూత్ లెవెల్ కమిటీ అధికారులు నివృత్తి చేశారు. ఈవీఎంలో 15 మంది అభ్యర్థులతో కూడిన ఈవీఎం ఓటర్లకు అందుబాటులో ఉంటుందన్నారు. తమకు నచ్చిన అభ్యర్థి గుర్తును చూసి మీటను నొక్కడం ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లందరూ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఓటు హక్కు లేకపోయినా, తప్పులు దొర్లినా సత్వరమే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామ కార్యదర్శి సుప్రియ, వీఆర్ఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

### గ్యాస్ కనెక్షన్ ఈ-కేవైసీకి తుది గడువు లేదు

అంబాజీపేట/రావులపాలెం: గ్యాస్ కనెక్షన్‌దారుల ఈ-కేవైసీ విషయంలో ఎటువంటి తుది గడువు లేదని ఎమ్మెస్వో ఎం.రమాదేవి శుక్రవారం తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకునే వారు ఎవరూ అపోహలు పడవద్దని లబ్ధిదారులందరికీ ఈ-కేవైసీ నమోదు చేస్తారన్నారు. డెలివరీ బాయ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌లోనే ఈ కేవైసీ చేయొచ్చన్నారు. ఈ-కేవైసీ చేయకపోయినా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎల్‌పీజీ డీలర్లందరూ ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు.